నమస్తే తెలంగాణ

# ఆదిలాబాద్-నిర్మల్




నాగోబా జాతర ముగించుకుని స్వగ్రామానికి వెళ్తున్న ఆదివాసులు

## 'చిత్రం' పదిలం..

**నేడు ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం**

ఒక్క ఫొటో వేల భావాలను తెలుపుతుంది. అటువంటి గొప్పదనం ఒక్క చాయా చిత్రానికి మాత్రమే ఉంది. ఈ ఆధునిక కాలంలో మావన జీవనానికి, ఫొటోగ్రఫీకీ విడదీయలేని బంధం ఉంది. రెండు గ్రీకు పదాల కలయికే ఫొటోగ్రఫీ. ఫొటో అంటే చిత్రం, గ్రఫీ అంటే గీయడం అని అర్థం. ఫొటోగ్రఫీ అంటే కాంతితో చిత్రాన్ని గీయడం. 18వ శతాబ్దంలో ప్యారిస్‌లో నలుపు తెలుపుతో ప్రారంభమైన ఫొటోగ్రఫీ కాలక్రమంలో రంగులు అద్దుకుంటూ కొత్త పుంతలు తొక్కుతోంది. మన దేశంలో ఇంటర్నేషనల్ ఫొటోగ్రఫిక్ కౌన్సిల్ 1991 నుంచి దేశంలో ప్రతి యేటా ఆగస్టు 19వ తేదీన ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని జరపడం ప్రారంభించారు.

*- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, ఆగస్టు 18*


క్లిక్.. క్లిక్..


అంకోలి చెరువులో ఇమిగో పక్షి


సీతాగొంది చెరువులో పిల్లల నోట్లో అన్నం వేస్తున్న పక్షి


● భగ్గుమన్న బేల

అంతర్రాష్ట్ర రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు, నాయకులను తొలగిస్తున్న పోలీసులు


అంతర్రాష్ట్ర రహదారిపై ధర్నా చేస్తున్న నాయకులు, రైతులు

# రేవంత్ రుణ మోసంపై..
# రైతన్న రణభేరి

## ఆందోళనలతో అట్టుడికిన ఆదిలాబాద్

- రెండో రోజూ నిరసనల హోరు..
- రోడ్డెక్కిన రైతన్న.. కొనసాగిన ధర్నాలు, రాస్తారోకోలు..
- సీఎం బొమ్మతో శవయాత్ర.. దిష్టిబొమ్మల దహనాలు
- అధికారుల నిలదీతలు.. ఆత్మహత్యాయత్నాలు

రైతు రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందంటూ ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా రెండో రోజైన ఆదివారం రైతులు ఆందోళనలు కొనసాగించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో హామీ ఇచ్చి ఎనిమిది నెలలు తర్వాత చేతులెత్తేశాడంటూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఆదిలాబాద్ జిల్లాలోని బజార్‌హత్నూర్ మండలం కేంద్రంతోపాటు తలమడుగు మండలంలోని రుయ్యాడి, బేల మండలంలోని సిర్సన్న, భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామాల్లో రైతులు కాంగ్రెస్ ప్రభుత్వ మోసాన్ని ఎండగడుతూ నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. బజార్‌హత్నూర్ మండలం కేంద్రంతోపాటు తలమడుగు మండలం రుయ్యాడిలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. అనంతరం సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేశారు. బేల మండలం సిర్సన్న, భీంపూర్ మండలం పిప్పల్‌కోటిలో రైతులు రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎలాంటి షరతులు లేకుండా ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని రైతులు డిమాండ్ చేశారు. బ్యాంకు రుణం రద్దు అయ్యేంత వరకు తమ ఆందోళనలు కొనసాగుతాయని హెచ్చరించారు.

*- ఆదిలాబాద్, ఆగస్టు 18(నమస్తే తెలంగాణ)*

## అంతర్రాష్ట్ర రహదారిపై ధర్నా

బేల, ఆగస్టు 18 : సిర్సన్న గ్రామ రైతులు ఆదివారం అంతర్రాష్ట్ర రహదారిపై ధర్నా నిర్వహించారు. వంటావార్పు నిర్వహించి, సామూహిక భోజనాలు చేశారు. అనంతరం బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కల్యాణ్ ప్రమోద్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీని భేషరతుగా మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ రుణం మాఫీ చేయాలని, లేని పక్షంలో రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు దేవన్న ఒల్లాప్వర్, మధూకర్ జక్కల్వర్, మస్కే తేజరావ్, దీపక్ గౌడ్, విపిన్ ఖోడే, విశాల్ గోడే, సురేశ్‌రెడ్డి, ఎం.సురేశ్, రూపేశ్ కాడే, గోధురి భూమన్న, సుధాకర్, చౌహాన్, గణేశ్ హుల్కే, సంజయ్ గోరె, అమోల్ ఊరాడే పాల్గొన్నారు.

## రాస్తారోకో, ధర్నా

బేల, ఆగస్టు 18 : మండల కేంద్రంలో ఆదివారం బీజేపీ నాయకులు, రైతులు కలిసి అంతర్రాష్ట్ర రహదారిపై రాస్తారోకో, ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చినటు వంటి రూ.2 లక్షల రుణమాఫీని వెంటనే అర్హులైన రైతులందరికీ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు నిక్కం దత్త, మండల కిసాన్ మోర్చా సెల్ అధ్యక్షుడు ఖోడే ప్రదీప్, మండల జనరల్ సెక్రెటరీ శివకుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మురళీధర్ ఠాక్రె, నాయకులు ఇంద్రశేఖర్, తేజరావ్, రాకేశ్, మోరేశ్వర్, నవీన్, మహేశ్, గణేశ్, కృష్ణ పాల్గొన్నారు.


● పిప్పల్‌కోటిలో పోరుకేక

## రైతన్న నిరసన గళం

▲ పిప్పల్‌కోటిలో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

భీంపూర్, ఆగస్టు 18 : పిప్పల్‌కోటి గ్రామంలో ఆదివారం దాదాపు 500 మంది రైతులు ప్రధాన రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ యువ నాయకుడు షేక్ అఫ్రోజ్ మాట్లాడుతూ.. అర్హులైన రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామంలో 3 వేల జనాభా ఉంది. 900 మంది రైతులు రుణమాఫీకి అర్హులు. కాగా 150 మందికే రుణమాఫీ వర్తించింది. నిరసనలో రైతులతోపాటు బీఆర్‌ఎస్ నాయకులు సాయి, రవి, కాంగ్రెస్ నాయకుడు రాంచంద్రారెడ్డి, బీజేపీ నాయకుడు కోకటి వెంకన్న పాల్గొన్నారు.


● బజార్‌హత్నూర్ చావు డప్పు

బజార్‌హత్నూర్ శవయాత్ర నిర్వహిస్తున్న రైతులు

## సీఎం దిష్టిబొమ్మతో శవయాత్ర


బజార్‌హత్నూర్ పాత బస్టాండ్ సమీపంలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న రైతులు

బజార్‌హత్నూర్, ఆగస్టు 18 : మండల కేంద్రంలో రైతులు ఆదివారం సీఎం రేవంత్ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ తీరును ఎండగడుతూ ర్యాలీ నిర్వహించారు. డప్పు చప్పుళ్ల మధ్య ప్రధాన వీధుల గుండా తిరుగుతూ శవయాత్ర నిర్వహించారు. అనంతరం బస్టాండ్ సమీపంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రుణం మాఫీ అయ్యే వరకు పోరాటం చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు చట్ల వినీల్, దీశి రమణ, తూరటి భోజన్న, చంద్రశేఖర్, సూది నందు, వినాయక్, గాండ్ల బక్కయ్య, లక్కం రాములు పాల్గొన్నారు.


● తలమడుగులో తన్నులాట

రుయ్యాడి గ్రామంలో సీఎం దిష్టిబొమ్మతో శవ యాత్ర నిర్వహిస్తున్న రైతులు

## పోలీసులు, రైతులకు మధ్య తోపులాట

తలమడుగు, ఆగస్టు 18 : మండలంలోని రుయ్యాడి గ్రామంలో ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను వాడవాడనా తిప్పుతూ రైతులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం సీఎం దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించారు. రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేసే క్రమంలో పోలీసులు, రైతులకు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఆగస్టు 15 నాటికి పూర్తిస్థాయిలో రుణమాఫీ చేస్తామని చెప్పిన సీఎం మాట తప్పి మళ్లీ ఇప్పుడు 4వ, 5వ విడుతలు అని కాలయాపన చేస్తున్నాడని ధ్వజమెత్తారు. రుణమాఫీ చేయాలని లేని పక్షంలో ప్రతి గ్రామంలో రైతు జేఏసీలు ఏర్పాటు చేసి ఉద్యమిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు వందల సంఖ్యలో పాల్గొనడం జరిగింది.

### మా ఇంట్లో ఒక్కరికే అయింది..



నాకు రుయ్యాడి గారమంలో 2.15 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో 2023 సంవత్సరంలో రూ.లక్ష రుణమాఫీ పొందాను. అలాగే ఇంకో పుస్తకంపై మా అమ్మ మరో రూ.లక్ష రుణం తీసుకున్నది. రాష్ట్ర ప్రభుత్వం మూడు విడుతల్లో అందరికీ మాఫీ చేస్తానని చెప్పింది. మాకు మాత్రం ఇప్పటి వరకు ఒక్క రూపాయి కూడా మాఫీ కాలేదు. అధికారులను సంప్రదించగా మీ కుటుంబంలో అందరికీ కలిపి ఒకే రేషన్ కార్డు ఉండడం వల్ల రుణమాఫీ కాలేదని తెలిపారు.

*- నక్క ధనుంజయ్, రైతు, రుయ్యాడి, తలమడుగు మండలం.*

### అర్హత ఉన్నా కాలేదు..



నా పేరు కోడిమల సుదర్శన్. నాకు మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. సాగు కోసం మహారాష్ట్ర బ్యాంకులో రూ.90 వేల రుణం తీసుకున్నా. అర్హత ఉన్న రుణమాఫీ కాలేదు. వ్యవసాయాధికారులను అడిగితే టెక్నికల్ ఇష్యూ వల్ల కాలేదని, ఇంటికి పంపించారు. రుణమాఫీ అవుతుందో కాదోనని ఆందోళనగా ఉంది.

### కేసీఆర్ ఆంక్షలు లేకుండా చేశాడు..



నా పేరు బొజ్జ ప్రవీణ్. మా గ్రామం రుయ్యాడి. మా నాన్న బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర తలమడుగులో రూ.1.10 లక్షల పంట రుణం తీసుకున్నాడు. రుణమాఫీ అవుతుందని మూడు విడుతలు ఎదురు చూశాం. అయినప్పటికీ కాలేదు. కేసీఆర్ హయాంలో మాత్రం ఎటువంటి ఆంక్షలు లేకుండా మాఫీ చేశారు. ఇప్పుడ కూడా అలానే చేస్తే మేలు జరుగుతది. లేకపోతే కొందరికి మాఫీ అయ్యి.. మరికొందరికి మాఫీ కాలేకపోతాయి.


పాపన్న చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఏఎస్పీ, డీఎస్పీలు, బీసీ సంక్షేమ, గౌడ సంఘం నాయకులు

## నిజాం సర్కారుపై పోరాడిన మహనీయుడు పాపన్నగౌడ్

**ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా**

ఎదులాపురం, ఆగస్టు 18 : రైతుల హక్కుల కోసం భూస్వాములు, నిజాం సర్కారుకు వ్యతిరేకంగా పోరాడిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఆదివారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బస్టాండ్ ఎదుట గల పాపన్న గౌడ్ విగ్రహం వద్ద అధికారికంగా ఆయన జయంతిని నిర్వహించారు. కలెక్టర్ రాజర్షి షాతోపాటు మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ముఖ్య అతిథులుగా హాజరై సర్దారార్ పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, భూస్వాముల నుంచి రైతులను కాపాడడం కోసం సర్దార్ పాపన్న గౌడ్ చేసిన పోరాటం మరిచిపోలేనిదన్నారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ మాట్లాడుతూ.. బహుజనులను ఏకం చేసి అగ్రకులం, పెత్తందారులకు వ్యతిరేకంగా పాపన్న గౌడ్ ప్రజలను చైతన్యంతులను చేశారనిఅన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ అభివృద్ధి శాఖ అధికారి రాజలింగు, అదనపు ఎస్పీ సురేందర్, డీఎస్పీ జీవన్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిక్కాల దత్తు, కలల శ్రీనివాస్, గౌడ సంఘం నాయకులు నర్సాగౌడ్, శంకర్ గౌడ్, చరణ్ గౌడ్, నాగన్నగౌడ్, శ్రీనివాస్ గౌడ్, దినేశ్‌గౌడ్, కౌన్సిలర్ ప్రకాశ్ పాల్గొన్నారు.

## యూత్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ

తలమడుగు, ఆగస్టు 18 : మండలకేంద్రంలోని కొత్తూరు గ్రామంలో ఆదివారం యూత్ సభ్యుల ఆధ్వర్యంలో కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారం ఘటనకు నిరసనగా కొవ్వొత్తులతో ర్యాలీ తీసి నిరసన తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నేరస్తులకు ఉరి శిక్ష వేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఇక్కడ యూత్ లీడర్‌తోపాటు పవన్ కుమార్, శ్రీకాంత్, రాస్, గంగాసింగ్, నారాయణ, కిశోర్, సాయికుమార్ ఉన్నారు.

# నాడు తండ్రి.. నేడు తల్లి..

- తల్లిదండ్రుల మృతితో అనాథగా మారిన బాలిక
- భిక్షమెత్తి అంత్యక్రియలు నిర్వహించిన అమ్మాయి
- బాలికను ఆదుకోవాలని వేడుకుంటున్న స్థానికులు

తానూరు, ఆగస్టు 18 : మండలంలోని బేల్‌తరోడా గ్రామానికి చెందిన మేరోళ్ల నరేశ్‌కు గంగామణితో ఎనిమిది యేండ్ల క్రితం వివాహమైంది. వీరికి దుర్గ కూతురు ఉంది. యేడాది క్రితం నరేశ్ అనారోగ్యంతో మృతిచెందాడు. అప్పటి నుంచి తల్లీబిడ్డలు ఇద్దరు మాత్రమే ఉంటున్నారు. గంగామణి కూలీ పనిచేస్తు బిడ్డను పోషిస్తున్నది. ఈ క్రమంలో ఆదివారం వేకువజామున గంగామణి(36) ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నది. ఒంటరి తనం, ఆర్థిక ఇబ్బందులతో తీవ్ర మనస్తాపానికి గురై మృతిచెందింది. ఆమె కూతురు నిద్ర లేచే లోగా తల్లి ఇంట్లో ఉరేసుకుని శవమై కనిపించడంతో బాలిక రోదిస్తూ ఇరుగు పొరుగు వారికి తెలిపింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృత దేహాన్ని భైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాలిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై భానుసింగ్ పేర్కొన్నారు.


తల్లి అంత్యక్రియల కోసం ఆర్థిక సహాయం అడుగుతున్న దుర్గ


తల్లి చితికి నిప్పు పెడుతూ..

### అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

కూలీ పనులు చేసుకుంటున్న ఆ కుటుంబంలో తినడానికి తిండి లేదు. తల్లి అంత్యక్రియలకు చిల్లి గవ్వ లేకపోవడంతో దుర్గా గ్రామంలో యాచించి అంత్యక్రియలు చేసింది. చలించిన పోలీసులు, స్థానికులు చందాలు చేసి ఆర్థిక సహాయం అందించారు. అనాథగా మారిన చిన్నారికి నిలువ నీడ లేదు. గుంట భూమి కూడా లేదు. ఇప్పుడు ఆమె పరిస్థితి దయనీయంగా మారింది. దుర్గ స్థానికంగా ఆరో తరగతి చదువుతుంది. దుర్గను ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.


చిన్నారికి చెక్కు అందజేస్తున్న కిరణ్ ఫౌండేషన్ ప్రతినిధులు



కేటీఆర్ చేసిన ట్వీట్

## తల్లి అంత్యక్రియలకు కూతురు భిక్షాటనపై చలించిన కేటీఆర్

- ట్విట్టర్‌లో స్పందన
- స్థానిక నేత ద్వారా రూ. 10 వేల ఆర్థికసాయం

తానూర్ ఆగస్టు 18: నిర్మల్ జిల్లా తానూర్ మండంబెల్‌తరోడలో తల్లి అంత్యక్రియలకు సాయం చేయాలంటూ కూతురు దుర్గ భిక్షాటన చేసిన వార్తను చూసి బీఆర్‌ఎస్ వర్కింట్ ప్రెసిడెంట్ కేటీఆర్ చలించిపోయారు. ముథోల్ బీఆర్‌ఎస్ నాయకుడు కిరణ్ కుమ్రేవార్‌ను బెల్‌తరోడకు వెళ్లాలని అదేశించారు. కిరణ్ కుమ్రేవార్ వెంటనే స్పందించి గ్రామానికి కిరణ్ ఫౌండేషన్ ప్రతినిధులను పంపి రూ.10వేలు అందించారు. కేటీఆర్ ట్వీట్‌కు కలెక్టర్ స్పందించి అనాథ బాలికను ఆదుకుంటామని హామీఇచ్చారు.

## కామాంధులను అరెస్టు చేయాలి..

ఎదులాపురం, ఆగస్టు 18 : పశ్చిమ బెంగాల్‌లోని కోల్‌కతాలో గల ఆర్జీ కార్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో పని చేస్తున్న జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం చేసి నిర్దాక్షిణ్యంగా హత్య చేసిన కామాంధులను వెంటనే అరెస్టు చేసి, శిక్షించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకట్ అన్నారు. బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ ఆ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అనంతరం జూనియర్ డాక్టర్ల నిరసన కార్యక్రమానికి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎ.స్వామి, వి.అశోక్, కోశాధికారి కె.కిష్టన్న, జిల్లా కార్యదర్శులు ఎ.ఇస్తారి, కె.శ్రీనివాస్, గౌస్ మొహియొద్దీన్, సి.విలాస్, ఇ.శివన్న, కె.శంకర్, మహిళా ప్రతినిధులు కె.శ్రీలత, ఆర్ మీరా, డి.రజిని, అనిత, శ్రీవాణి, సరిత, శివలీల పాల్గొన్నారు.


నాటక ప్రదర్శిస్తున్న రిమ్స్ జూనియర్ డాక్టర్లు

### నాటక ప్రదర్శన

కోల్‌కతాలో విద్యార్థినిపై అత్యాచారం ఘటనలో నిందితుడిని కఠిన శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం రిమ్స్ జూనియర్ డాక్టర్ల ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఆదివారం జూనియర్ డాక్టర్లు నల్ల దుస్తులు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చౌక్ వద్ద వైద్యులు నాటక ప్రదర్శన నిర్వహించారు.